# శీలం

"అరేఁయ్ సత్తెం, నీ జయలలిత వచ్చిందిరోయ్" - అని ప్రక్క షెడ్డులో పనిచేసే కోటి కేకేశాడు.

లారీ మడ్గార్డులకు పట్టి ఎండిపోయిన బురదను గీకుతున్న సత్యం తలెత్తి చూశాడు.

సత్యాన్ని చూచి జయలలిత నవ్వింది. నవ్వినప్పుడు ఎత్తుపళ్ళు బయటపడి వాటిమీద వుదయపుటెండ పడి తళతళ మెరిశాయి.

సత్యం ఆ నవ్వు, ఆ పళ్ళు చూచి చిరాకు పడ్డాడు. దీని మొహం యీడ్చా పొద్దున్నే సచ్చిందే. ఈ మూగముండ అని గట్టిగా తిట్టి మళ్ళీ విసురుగా తన పని తను చేసుకోవడం మొదలు పెట్టాడు.

"నీకోసమేరా. హీరో నాగేస్సర్రావు వున్నావని వచ్చిందిరా. ఇద్దరూ లారీ ఎక్కి షికారు పోండెఁహే."

"ఏది అదృష్టవంతులు సనిమాలో నాగేస్సర్రావు జయలలిత లారీలో వెళ్తారే - అట్టా వెళ్లమంటా వేంటి?" - మడ్డిగా, నల్లగా, క్రూడాయిల్ లాగా వున్న కోటి అసిస్టెంట్ సూరి పకపక నవ్వుతూ అన్నాడు.

"అరేఁయ్ సూరిగా! నా వూసు ఎత్తావా, నీ తలకాయ తీసికెళ్ళి మాబెంజి బండి వెనక టైరు కింద పెడ్తా, జాగ్రత్త!" అన్నాడు సత్యం కోపంగా, వుక్కురోషంగా.

"ఓరబ్బ ఎంత రోషంరా! ఆడంటె సమ్మగుందే! నేనంటే పొడ్చుకొచ్చిందా?" అన్నాడు సూరి తిర్గి.

ఆ మూగదానికి వీళ్ళ కీచులాటేమీ అర్థం కాలేదు. దానికి మూగతనమే కాకుండా పుట్టెడు చెముడు కూడా వుంది.

సత్యం రోజూ తనని తన ఎదుటనే తిట్టుతున్నాడని దానికి తెలియదు. తనంటే వాడికి తగని అసహ్యమని కూడా తెలియదు. తనకీ లారీ కుర్రవాళ్ళు జయలలిత అని పేరు పెట్టారని కూడా తెలియదు.

మూగది చంకలోని పాత గుడ్డల మూటను సత్యం ప్రక్కగా క్రింద పడేసి దానిమీద వుషారుగా కూర్చుని, సత్యాన్ని చూచి మళ్ళీ నవ్వింది - ప్రేమగా, చనువుగా. జవాబుగా సత్యం చిరాకుగా చూశాడు. అతని చిరాకును చూచి మొగం ముడుచుకుంది.

"ఏఁరోయ్, మీ మూగదానికి సోకులెక్కువయ్యాయి" అన్నాడు కోటి.

నిజమే - దానిలో ఏదో షోకు చేసుకోవాలనే తాపత్రయం కనిపిస్తోంది. తన రాగి జుట్టుకు నూనో, ఆముదమో పట్టించి తల నున్నగా దువ్వుకుంది. ఒక ఎర్రపాత పీలికను రిబ్బను లాగా జడ చివర్న

కట్టింది. ఎంత జడ! ఎలక తోకంత - బిగించి వేసుకున్న జడమూలంగా, నూనె వోడుతూ వికారంగా వున్న మురికి మెడ సాగిలబడి కనిపిస్తుంది. జడలో ఒక బంతిపూవు పెట్టుకుంది. కుంకపోళ్ళ దగ్గరమ్మే ఎర్ర కుంకాన్ని బొట్టు పెట్టుకుంది. ఎండలో నడిచి రావటం మూలంగా ముక్కు మీద, మూతి మీద గుడ్లుగుడ్లుగా చెమట పట్టింది.

మూగదాని వేషంలో ఈ మార్పు నాలుగయిదురోజులుగా కనిపిస్తుంది. అంతకుముందు నూనె వాడకం లేక రాగివర్ణం దాల్చి, మొగం మీదకు వ్రేలాడే చింపిరి జుట్టుతో జిడ్డుకారే మడ్డి మొగంతో మకిలిగా మసిపట్టిన దాక లాగా వుండేది. ఇప్పుడు అంటల్లో వేసిన మసిపట్టిన యిత్తడి తపాల లాగా వుంది. పుసికట్టిన కళ్ళతో పిచ్చి పిచ్చి చూపులు చూచేది. యిప్పుడు కంటి నిండుగా నిలకడ చూపులు చూస్తుంది. వుండి వుండి ఆ కళ్ళమీద కనురెప్పలు వాలి మళ్ళీ చటుక్కున లేస్తున్నాయి. పెదాల మధ్యన నవ్వుల్నియిరికించటం, మళ్ళీ వదిలేయడం తెలుస్తుంది. పరువం వచ్చినా పమిట ప్రాముఖ్యత ఏమిటో తెలియని మూగదానికి యిప్పుడు పమిట సరిజేసుకోవటం, రొమ్ముల్ని చూచుకోవటం తెలుస్తోంది. సిగ్గుపడటం తెలుస్తోంది. మొగవాళ్ళు తెలుస్తున్నారు, తన ఆడతనం తెలుస్తుంది.

మూగదానిలో ఈ మార్పుకు కారణం ఈ లారీ క్లీనరు సత్యం; పదిహేను రోజుల క్రిందటి ఒక మిట్టమధ్యాహ్నం.

ఆనాటి మిట్టమధ్యాహ్నం ఏం జరిగిందంటే -

* * *

మూగది నెత్తిమీద పాతగుడ్డల మూట పెట్టుకుని లారీ షెడ్డుల్లో పాతగుడ్డలమ్ముకుంటూ సత్యం పనిచేస్తున్న లారీ షెడ్డుకే వచ్చింది.

పాతగుడ్డల మూట నెత్తిమీద పెట్టుకుని రోజూ లారీ షెడ్డుల వెంట తిరిగి గుడ్డలమ్ముకునే ఈ మూగదాన్ని చూస్తే చాలామందికి జాలి, గుడ్డలు తీసుకోమని మూగగా "ఆ-ఆ-" అంటూ సైగలు చేస్తుంటే "పోనీయ్‌లే పాపం!" అని అప్పటికి అవసరమున్నా లేకపోయినా దాని దగ్గరే పాతగుడ్డలు కొంటూ వుంటారు- లారీ షెడ్డువాళ్ళు, చిన్నకార్ల వాళ్ళు, రిక్షావాళ్ళు.

ఈ మూగది ఎక్కడ్నుంచి వచ్చిందో ఆ వూరికి వచ్చింది. కాలవ గట్టు ప్రక్క గుడిసెల్లో దాని చుట్టమెవరో ఒక ముసిలిది వుంటున్నది. ఆ ముసిలిదే దీన్ని ఏ వూర్నుంచో తీసుకొని వచ్చి వుండాలి. ఈ పాతగుడ్డలమ్మటమే కాకుండారోజూ పొద్దున, సాయంత్రం గొడ్లు వచ్చే వేళకు తట్ట తీసికొని పేడవేసుకుని గుడిశ ముందు పోగువేస్తూ వుంటుంది. ఆ ముసలిది పిడకలు చేస్తే, ఇది ఆ పిడకలు కమ్మరివాళ్ళ కొలుములకు తీసికెళ్ళి అమ్ముతూ వుంటుంది.

ఈ మూగదాన్ని చూస్తే చాల మందికి జాలి అని చెప్పానా. ఈ సత్యానికి కూడా అంతకు ముందు దాక జాలే పాపం! కాని, అప్పుడు పాతగుడ్డల మూట నెత్తిన పెట్టుకుని వచ్చిన దాన్ని చూస్తే సత్యానికి జాలితోపాటు ఇంకేదో కలిగింది.

ఆ సమయంలో ప్రక్క షెడ్డుల వాళ్ళెవరూ లేరు. అంతకు ముందే ఒక బండిని (లారీని) రిపేరు

చేసిన మెకానిక్ ట్రైలుకు తీసికెళ్ళాడు. సత్యం ఒక్కడే వున్నాడు. తను సాయంత్రం పూట షెడ్డు ఓనర్ గారింటికెళ్ళి నీళ్ళు అవీ తోడాలి. అందుకని ట్రైల్‌కు వెళ్ళకుండా షెడ్డులోనే వుండిపోయాడు.

సత్యం ఎక్కువగా లైనుమీద కెళ్ళడు. ఎవరూ పంపరు కూడా. ఎందుకంటే వోనర్ గారింటి దగ్గర పని చేయాలని. వాడికి వోనర్‌గారింట్లో పని చేయటమంటే మహా సరదా. వోనర్ గారి భార్య కూడా సత్యాన్నే ఇంటిపని చేయడానికి రమ్మంటుంది.

సత్యం సరదాకి కారణం వోనర్‌గారి పడుచు పెళ్ళాం!

వోనర్‌గారి భార్య యింటి పనికి సత్యాన్నే రమ్మనటానికి కారణం - భర్త ముసలితనం! సత్యం పడుచుదనం! సత్యం మోటుతేలిన శరీరం, కండలు తిరిగిన చేతి దండలు, బలమైన ఛాతి, ఆమెకు పడుచుదనపు టాకలి ఎక్కువ. ఆ ఆకల్ని రోజూ కనుచీకటి వేళ దొడ్లోని పాత సామానుకొట్లో సత్యంతో తీర్చుకుంటుంది.

వోనర్ గారింటికి వారం రోజుల క్రిందట ఎవరో చుట్టాలు పక్కాలు చాల మంది వచ్చారు. అమ్మగారు చుట్టాలతో, యింటిపనితో చాల హడావుడిగా వుంటున్నారు. అసలు తనవంక కన్నెత్తే చూడటం లేదు. చూచినా దొడ్లోకి రావడం లేదు. దొడ్లోకి వచ్చినా సామానుకొట్టుకేసి అసలే రావటం లేదు.

అందుకని సత్యానికి ఈ వారం రోజుల్నుంచి నైటు డ్యూటీలో రోజూ ఇరాని హోటల్‌లో బిరియాని తింటుంటే వళ్ళంతా తిమ్మిరి తిమ్మిరిగా వుంది.

మూగది పెద్ద మూటలోంచి కండెలుగా కట్టిన చిన్న గుడ్డమూటలు తీసి సత్యాన్ని తీసుకోమన్నట్లు "ఆఁఆఁ" అంటున్నది. వేపచెట్టు చల్లని నీడలో ఆ సమయంలో మూగది సత్యానికి వనదేవతలా కనిపించింది. ఇన్నాళ్ళుగా కేవలం పరుల నవ్వుల కాకరమైన దాని ఆకారంలో సత్యానికి ఆ సమయంలో కొంటె వంపులు, వింత అందాలు, ఏదో ఆకర్షణా - కనిపించాయి.

మూగదాని పదహారేళ్ళ జీవితంలో మొదటి సారిగా మొగవాడి చూపులు దాని వంటిమీదకు వాలటం, కాంక్షతో వంటి భాగాలను తాకటం అదే మొదటిసారి.

ఆ చూపుల సంగతి, సత్యంలో కలుగుతున్న వికారం సంగతి దానికేం తెలుసును? పాపం! గుడ్డలు తీసుకోమని "ఆఁ ఆఁ" అంటున్నది - మూగ గోలచేస్తూ.

సత్యం గుడ్డలు తీసుకుంటానని దాన్ని షెడ్డు లోపలికి, మూలకి, టైర్ల ప్రక్కకు వేడెక్కిన టార్పాలిన్ మీదకు తీసికెళ్ళాడు. వాడు తననేం దుర్బుద్ధితో రమ్మంటున్నాడో దానికేం తెలుసు? ఎందుకోననుకొని వాడి వెనకాలే వెళ్ళింది.

దాన్ని అలా తీసికెళ్ళి విపరీతమైన కాంక్షతో రెండు చేతులతో గట్టిగా, బలంగా చుట్టి బాగా దగ్గరకి లాక్కున్నాడు.

ఆ క్షణంలో... మూగదాని జీవితంలో మొదటిసారిగా దాని మెదడులో "ఈ సృష్టికార్యం" స్విచ్ నొక్కగానే టక్కున లైటు వెలిగినట్లు వెలిగింది. మొదటిసారితనకు ఆడతనం తెలిసింది. దేనికోసం

ఈ సత్యం తనని అంత బలంగా దగ్గర కదుముకుంటున్నాడో, అతడి చేతులు తననెందుకలా చుట్టుకుంటున్నాయో తెలిసింది. జీవితంలో మొదటిసారిగా దాని రక్తం వేడెక్కింది. మొదటిసారిగా దాని నరాలు సాగి బలమైన కోర్కెను కిందకు పుట్టించాయి. తనని, తన శరీరాన్ని కోరేవాళ్లు కూడా వున్నారని మొదటిసారిగా తెలిసింది.

మొదటిసారిగా తన కన్యాత్వాన్ని ఫణంగా పెట్టి తన మూగగుండెలోకి ఏదో తెలియని ఆనందాన్ని, ఒక మహా గొప్ప అనుభూతిని నింపుకుంది.... ఆ క్షణానికి గొప్ప విలువ నిచ్చి ఒక గొప్ప పవిత్రతను నిలుపుకొని తన గుండెల్లో దాచుకుంది. ఆ గొప్ప క్షణానికి కారణమైన వాడైన ఈ క్లీనర్ సత్యమే తనవాడు అనుకుంది.

ఆ క్షణం నుంచే దాని మూగగుండెల్లో ప్రేమ చెమ్మ పట్టింది.

ఆ క్షణం నుంచే సత్యం ఆ మూగదానిమీద విపరీతమైన అసహ్యాన్ని పెంచుకున్నాడు.

ఆరోజు నుండి రోజూ పొద్దునా, సాయంత్రమూ కనీసం రెండుసార్లయినా సత్యాన్ని చూడకుండా వుండలేకపోతోంది మూగది.

తన జీవితంలో ఆరోజు అలా జరగడం ఒక శాపం అనుకున్నాడు సత్యం.

తన మూగజీవితంలో ఆరోజు అలా జరగటం ఒక వరం అనుకుంటున్నది మూగది.

★ ★ ★

సత్యం తన ప్రక్క గుడ్డల మూట మీద కూర్చున్న ఆ మూగదాన్ని అతి చిరాకుగా చూస్తూ, కుడిచేతిని గుప్పిలి చేసి "ఏమిటి?" అన్నట్లు గట్టిగా వూపాడు.

మూగది పమిట చెంగు కొసన కట్టిన మూటను చూపించి నవ్వింది. సత్యం ఆ మూట ఏమిటో తెలియక మొగం చిట్లించాడు. మూట ముడిని పంటితో విప్పి అతని ముందుగా పెట్టింది. ఎంతో గర్వంతో! (తన గుండెల్లో పదిలంగా మూట కట్టుకుని దాచుకున్న ప్రేమను విప్పి చూపిందా అన్నట్లు -) దాంట్లో తంపట వేరుశనక్కాయలున్నాయి.

సత్యం "ఛీ! ఇవా" అన్నట్లు మొగం పెట్టి వద్దు అని చేయి వూపి సైగచేశాడు.

"చాలా బాగుంటాయి" అని సూచించే విధంగా మూగది నాలికను పళ్ళ మధ్యకు తెచ్చి తల వూగించింది. కాసిని కాయలు గుప్పిట పట్టి తీసి సత్యాన్ని తీసుకోమంది. సత్యానికి లోపల తినాలని వున్నా, "ఆఁ దీనిదగ్గరేమిటి తీసుకొనేది. అన్నట్టు బెట్టు చేశాడు. మూగది బ్రతిమాలగా ఆఖరికి తీసుకున్నాడు.

ఒకచేత్తో ఒక్కొక్క కాయిని పళ్ళతో వలుచుకుంటూ, రెండో చేతితో మట్టిని గీకుతున్న సత్యాన్ని మూగది కళ్ళనిండా ప్రేమలు నింపుకొని ఏదో తెలియని ఒక విధమైన పారవశ్యంతో చూస్తోంది.

ప్రక్క షెడ్డులోంచి, కోటి, సూరి వుండి వుండి పకపకమని వెకిలి నవ్వులు నవ్వారు! సత్యంతోపాటు మూగది వాళ్ళవంక కోపంగా చూచింది.

"ఒరి దీనెమ్మ, దీనికెంత కోపం రోయ్," అన్నాడు సూరిగాడు.

కోటీ, "మనకెవతిస్తదిరా వేరుశనక్కాయలు, పద ఒక అరటీ వేసుకొద్దాం - పాపం, వాళ్ళకు మనం అడ్డు దేనికి?" అని, మూగదాన్ని చూచి బూతు అర్థం వచ్చేటట్లుగా చేతులతో సైగలు చేశాడు.

మూగది కోపంగా మెటికలు విరిచి, కుడిచేయి చూపుడు వేలు చూపుతు "వ-వ-" అని అంది.

వాళ్ళు విరగబడి నవ్వుతూ ఆ సందుదాటి పోయారు.

వాళ్ళు సందుదాటటం చూచి, మూగది ముందుకు జరిగి సత్యం కుడికాలు పట్టుకుని చూచింది, "కాలు నొప్పి తగ్గిందా!" అని సైగ చేసింది.

సత్యం నాలుగు రోజుల క్రిందట లారీ టైరురిమ్ కాలిమీద వేసుకున్నాడు. కాలు బాగా బరువు చేసి నడవనీయలేదు. మూలుగుతూ షెడ్డులో కూర్చున్నాడు. మూగది మామూలుగా షెడ్డుకొచ్చి, వాచిన సత్యం కాలు చూచి కంగారుపడిపోయింది. ఇప్పుడే వస్తానని తొందర తొందరగా ఎక్కడికో పోయింది.

ఒక అరగంటలోపల ఎక్కడ్నుంచి తెచ్చిందో ఒక చిన్న సీసాలో ఆముదం తెచ్చింది. సత్యం వద్దని విదిలించి కొట్టుతున్నా వినకుండా వాడి కాలికి ఆముదం రాసి బాగా తోమింది. పైకి ముఖంలో చిరాకు కనిపింపచేసినా, ఆముదంతో అలా తోముతుంటే సత్యానికి ప్రాణమెంతో హాయిగా వుంది. అలా మూడురోజుల పాటు రెండుపూటలా వచ్చి ఆముదంతో తోమేసరికి వాపు చాలావరకు తగ్గిపోయింది.

అదే పూర్తిగా తగ్గిపోయిందో లేదోనని ఇప్పుడుకాలు పట్టుకుని చూస్తోంది. కాలంతా కిందకూ మీదకూ తడుముతూ పూర్తిగా తగ్గిపోయిందాన్నట్లు కళ్ళు పెద్దవి చేసి తలవూపుతూ ఎంతో సంబరపడిపోయింది.

సత్యం కాలిమీద చేతితో మెల్లగా ప్రేమగా రాస్తోన్న మూగదాని కళ్ళల్లో ఏదో కాంక్ష తొంగి చూసింది. సత్యంకు దాని కళ్ళలోకి చూచి ఆ కళ్ళల్లో నిండిన కాంక్షను - గుండెలోకి చూచి ఆ గుండెల్లో నిండిన ప్రేమను చూచే శక్తి లేదు. అవసరం అంతకంటే లేదు. ఆనాటి మధ్యాహ్నం తనలో రగిలిన ఏ కాంక్షను తీర్చుకొనుటకు మొదటిసారిగా ఆ మూగదాన్ని, గుండెల్ని రాజేసి దానిలో ఈ పాడు కాంక్షను ఎగదోశాడో, ఆ కాంక్ష యిప్పుడు వాడిలో లేదు. తాను ముట్టించిన నిప్పు ఆ మూగదానిలో రాజుకుని భుగభుగలాడుతుందని వాడికి తెలియదు; ఆ నిప్పు సెగకు దాని మూగ గుండెల్లో పేరుకుపోయిన ప్రేమ కరిగి, మరగకాగుతుందని వాడికి తెలియదు.

"వాళ్లు వస్తారు, ఫోఫో" అని తొందర చేశాడు. అది పోకుండా అక్కడే కూర్చుంది. వాడ్ని వూరికే చూస్తూ కాంక్షలు వెదజల్లే కళ్ళతో ప్రేమ కాగడాలు ఎత్తుతూ, వాడి గుండె గుహలోని చీకటిని ఈ ప్రేమకాగడాల వెలుగు చీలుస్తుందా?

ఇంతలో టీకి పోయిన సూరి, కోటి సందు చివర కనిపించారు. వాళ్ళు వచ్చి యింకా ఏమేమి అని ఎక్కిరిస్తారో అని సత్యంకు కంగారు పట్టుకుంది. వాళ్ళ వచ్చేసే లోపల దీన్ని పంపించి వేయాలని కోపంగా "ఫో" అని గద్దించి చేతితో వెనక్కి తోశాడు. మూగది వెనక్కి పడబోయి చేతులతో ఆపుకుని, వాడివంక బిత్తరపోయి బిక్కమొగంతో చూచింది. సత్యం కోపంగా చూశాడు. మెల్లగా లేచి నిలబడింది.

"పోవే మూగముండ!" అని మళ్ళీ గట్టిగా గద్దించాడు.

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెనక్కి, వెనక్కి తిరిగి చూస్తూ సందుకు రెండో వయిపు నడిచింది. వాళ్లు రానే వచ్చారు. నవ్వనే నవ్వారు. సూరిగాడయితే ఏదో బూతు మాట కూడా అన్నాడు.

ఏమీ చేయకుండానే దీని మూలంగా వీళ్ళ ఎక్కసక్కేలకు గురికావల్సి వచ్చింది కదా అనే వుక్కురోషంతో, తన వంక దీనంగా, ప్రేమగా ఏదో చెప్పాలనే మూగబాధతో, అర్థంకాని (సత్యం అర్థం చేసుకోలేని) పిచ్చి చూపులు చూస్తూ ఇంకా సందుచివరే నిలబడ్డ మూగదాని మీదకు, "పోవేమే! మూగముండ!" అని తిట్టుతూ మట్టిబెడ్డలు విసిరాడు, విపరీతమైన ద్వేషంతో, అసహ్యంతో.

పాపం అది కొన్ని క్షణాలు అక్కడే నిలబడి చంకలోని మూటను నెత్తిమీద కెత్తుకుని సందు మలుపు తిరిగి వెళ్ళిపోయింది.

...... ఆ మర్నాడు వుదయం పది గంటలకు మళ్ళీ షెడ్డుకేసి వచ్చింది. అప్పుడు సత్యం షెడ్డులో లేడు. ఇంజనాయిల్ తీసికుని రావడానికి టిన్ తీసికొని బజారుకెళ్లాడు. మెకానిక్ రాములు ఏదో రిపేరు చేస్తున్నవాడల్లా మూగదాన్ని చూచి పని ఆపుచేసి సిగరెట్టు వెలిగించాడు. సత్యం ఏడని సైగచేసి అడిగింది. బజారు వెళ్లాడని చెప్పాడు. అతనికోసం అక్కడే కూర్చుంది.

మూగది ఆరోజు క్రొత్త జాకెట్ తొడిగింది. దాన్ని సత్యానికి చూపించాలనే వుబలాటంతో వచ్చింది. నిన్న సత్యం తనని రాళ్ళు వేసి కొట్టిన విషయం పూర్తిగా మర్చిపోయి.

మూగదాన్ని వళ్ళంతా కళ్లు చేసుకొని చూస్తోన్నాడు రాములు.

షెడ్డు లోపలి కెళ్ళి టైర్ పక్కన నిలబడి, అటూ ఇటూ చూచి ఎవరూ లేరని నిశ్చయించుకుని, మూగదాన్ని చేయి వూపి పిలిచాడు. అది రాములు ఆకలి చూపులు తెలుసుకుంది. ఎందుకు తనని అక్కడకి రమ్మని పిలుస్తున్నాడో అర్థం చేసుకుంది. రానని చెప్పి తల అడ్డంగా వూపింది.

రాములు జేబులోంచి రూపాయి కాగితం తీసి చూపించాడు. అయినా సరే రానంది. ఇక లాభం లేదనుకొని రాములు ఇవతలికి వచ్చేశాడు.

రాములు, "పిలుస్తుంటే రావేం?" అన్న అర్థం వచ్చేటట్లుగా సైగలు చేశాడు.

"తప్పు"! అన్నట్లు నాలిక బయటపెట్టి ముక్కు మీద వేలు వేసుకుంది.

"ఆడు, సత్యంగాడయితే తప్పులేదా?" అని సైగలతో అడిగాడు.

మర్మగర్భంగా నవ్వి, "వాడు నావాడు!" అన్నట్లుగా కుడి అరచేతితో గుండెలమీద తట్టుకుంది. ఎంతో తృప్తిగా, గర్వంగా, విలాసంగా.

రాములు నవ్వి, "ఓసి మూగముండ" అని పైకి నోటితో అంటూ, "వాడు నీ మెళ్ళో తాళి కట్టాడా?" అని సైగచేసి ప్రశ్నించాడు.

మూగది, "ఓరి పిచ్చిపుల్లాయి, ఇంత మాత్రం తెలియదా?" అన్నట్లు నవ్వి ఆకాశం వయిపు చూపించి, "వ-వ-" అంటూ కళ్లు పోతాయని అభినయం చేస్తూ ఏవేవో సైగలు చేసింది.

ఆ సైగల అర్థాన్ని, దాని భావాన్ని మాటల్లోకి అనువదిస్తే - 'మెళ్ళో తాళికట్టనంత మాత్రాన భర్త

కాకపోదు. ఆడది జీవితంలో మొదటిసారిగా ఎవరికి తన కన్యత్వాన్ని అర్పిస్తుందో వాడే తన భర్త. జీవితాంతం వాడితోనే వుండాలి. వాడికి ద్రోహం చేస్తే దేముడు కళ్లు పోగొట్టుతాడు."

ఆయిల్‌టిన్ తీసికొని వస్తోన్న సత్యం సందు చివర్నుండే వీళ్ళ సైగలు, యాక్షన్సు చూచి సందర్భం అర్థం చేసుకున్నాడు. ఒక్క క్షణమంటె ఒక్క క్షణం వాడి మనస్సు వాడికి తెలియకుండానే రవ్వంత మెత్తపడింది. "ఓసి పిచ్చిముండా, నేనంటే నీకెంత ఇదే!" అని మనస్సులో అనుకున్నాడు. మరుక్షణంలో సిల్కు చీరల్లో షోకయిన అమ్మగారి సుందరరూపం, తను లేకపోతే ఒక క్షణమైన బ్రతుకగలదా అనిపించేటట్లుగా సామానుకొట్లో ఆమె ప్రవర్తించే తీరు కళ్ళకు కట్టినట్లనిపించింది. ఆమెగారెక్కడా, ఈ పాడుముండ ఎక్కడా అనుకున్నాడు. "ఛీ, మూగముండా?" అని మనస్సులో విసుక్కున్నాడు.

## 2

పదిహేను రోజుల తర్వాత -

కప్పెడు కప్పెడు చీకటి పడుతున్న సమయంలో, దశమి చంద్రుడు పలచటి వెన్నెల్ని వెదజల్లుతున్న సమయంలో సత్యం హుషారుగా ఈలవేసుకుంటూ వోనర్ గారింటి వయిపు పోతున్నాడు.

వారం రోజులుగా సత్యం వూళ్ళో లేడు. ఈసారి సత్యం లారీమీద లైనుకు పోవల్సి వచ్చింది. సత్యం వోనర్‌గారికి మెకానిక్ షెడ్డు కాక బాడుగకు తిరగడానికి రెండు లారీలు కూడా వున్నాయి; మామూలుగా లైనుమీదకెళ్ళే క్లీనరు పెళ్ళని సెలవు తీసికున్నాడు. అందుకని యిక సత్యానికి తప్పలేదు.

ఇవాళ సాయంత్రమే డ్యూటీ దిగాడు. వెంటనే యింటికి వెళ్ళి తలంటు స్నానం చేసి, యిస్త్రీ బట్టలేసుకుని వోనర్ గారింటికి బయలుదేరాడు. మధ్యలో నాయర్ హోటల్‌లో వుల్లిపాయల పెసరట్టు తిని, టీ త్రాగాడు. కిమాం కిల్లీ బుగ్గన బిగించి వుషారుగా ఈలవేసుకుంటూ అమ్మగారి దగ్గరకు పోతున్నాడు.

ఇది మామూలుగా తను వోనర్ గారింట్లో పనిచేసేవేళ, రోజూ ఈ పాటికి తను రెండు తొట్లనిండా నీళ్ళు తోడడం పూర్తి చేస్తాడు. తను నీళ్ళు తోడడం పూర్తి చేయగానే అమ్మగారు వీధి తలుపేసి పాలచెంబు తీసుకొని గేదెపాలు తీయడానికి దొడ్లోకి వస్తుంది, "ఏరా సత్యం!" అని ఎంతో తియ్యగా పలుకరిస్తుంది- పాతసామాను కొట్లోకి దారితీస్తూ - ఆమె ఎంత మంచిది. తనంటె ఎంత ప్రేమ చూపుతుంది. విధిలేక ఈ పెళ్ళి చేసుకుంది కాని మొదట్నుంచి తనకు అలవాటు అయిపోయింది. ఏమిటో ఆ దేముడు మా ఇద్దరికి ఇలా జతచేసి పెట్టాడు. ఈ బ్రతుకులిలా వెళ్లమారవలసిందే. ఇంటి దగ్గర అమ్మ పెళ్ళి చేసుకోరా అని రోజూ పోరు పెట్టుతుంది. పెళ్ళి చేసుకుంటే ఇవన్నీ కుదురుతాయా? అమ్మగారు తనకు దూరమయిపోరూ? అమ్మో, ఆమె పొందు లేకపోతే తను బ్రతకగలడా?

సత్యం మనస్సులో మూగది మెదిలింది. ఛీ! పాడుముండ - ఇంతమంచివేళ అది గుర్తుకు వచ్చిందేమిటి? బంగారపు బొమ్మలాంటి అమ్మగారికి, ఈకలు పీకిన కోడిపెట్ట లాంటి మూగదానికి సారూప్యమేమిటి? అనుకున్నాడు.

వోనర్ గారిల్లు సమీపించగానే ఆలోచనలు ఆగిపోయాయి.

వీధి వయిపు లారీ ఆగి వుంది. బాడుగలు అప్పచెప్పడానికి రెండో బండి డ్రైవర్ వచ్చి వుంటాడు. తను దొడ్డి దార్ని వెళ్ళితే సరి. తను ఎక్కువగా ఎప్పుడూ దొడ్డి దార్నే వెళ్ళుతూ వుంటాడు. తన పని అంతా దొడ్లోనే కదా.... దొడ్డి తలుపు దగ్గరకేసి వుంది. తనూళ్ళోకి వచ్చినట్లు అప్పుడే అమ్మగారికి తెలిసిందన్నమాట!

తలుపు మెల్లగా తోసుకొని లోపలికడుగుపెట్టాడు. పెట్టిన అడుగు పెట్టినట్లే వుంది. మరో అడుగు పడలేదు. తలుపు ప్రక్కనే వున్న సామాను కొట్లోంచి గుసగుసలు, నిట్టూర్పులు.... వినిపించాయి.

సత్యం వెనక్కి తిరిగాడు. పరిస్థితి అర్థమయింది. సామానుకొట్లో అమ్మగారు, మెకానిక్ రాములు వున్నారని గ్రహించగలిగాడు. మనిషి నిలువునా నీరయిపోయాడు. ఎంత మోసం! ఎంత ద్రోహం! గుండెలోకి బాకు దిగేశారు. గుడిశకు నిప్పంటించారు. విపరీతమైన కోపంతో, ఆవేశంతో మనిషి కుతకుత వుడికిపోతున్నాడు. అమ్మగారు!..... ఛీ, పాడుముండ. నీతి లేనిది... ఎన్ని తియ్యటి మాటలు చెప్పేది. నీవు లేందే బతకలేనురా సత్యం అన్న మనిషి.... ఇలా... ఛీఛీ... మనిషిలో ఎంత విషం వుంది. పెళ్ళీ పెటాకులు లేకుండా దీనితోనే గడపాలి అనుకున్నాడు..... తనొక్కడితోనే గుట్టుగా వుందనుకున్నాడు. ఇది దేముడు కుదిర్చిన జత అనుకున్నాడు. తనకు తెలియకుండా ఎంతమందితో ఇలా సాగిస్తుందో. చేసే తప్పుడు పనిలోనయినా నీతి వుండొద్దూ....

సత్యానికి విపరీతమైన నీరసం వచ్చింది. ఇక ఒక అడుగయినా ముందుకు వేయలేకపోయాడు. మెల్లగా వీధి వయిపు ఆపిన లారీలో ఎక్కి కూర్చున్నాడు. స్టీరింగ్ మీద తలపెట్టుకున్నాడు. తొంభైమైళ్ళ స్పీడులో వెళ్లే లారీ చక్రంలాగా సత్యం బుర్ర గిర్రున తిరిగిపోతుంది... మూగది గుర్తుకు వచ్చింది. ఎంత నీతిపరురాలు. తనంటే ఎంత పడిచస్తుంది? ఎంత అలమటించిపోతుంది? ఆ రోజు తన కాలిమీద రిమ్ వేసుకున్నప్పుడు ఎంత గిలగిల్లాడిపోయింది? కట్టుకున్న పెళ్ళాం కంటె, కన్న తల్లికంటె ఎక్కువగా ఆ నాలుగు రోజులు రెండు పూటలా కాలు తోమింది. కాలు తోముతున్నప్పుడు దాని కళ్ళల్లో ప్రేమానురాగాలు నిండిపోయాయి. ఒకపూట తనను చూడకపోతే కంగారు పడిపోతుంది. అవి, ఇవి తెచ్చి తనకు పెడుతుంది. తీసుకోకపోతే వూరుకోదు. తిట్టినా, కొట్టినా తన్ను పట్టుకుని దేవులాడుతుంది. ఆరోజు తను దానిమీదకు రాళ్ళు విసురుతుంటే ఎంత దీనాతిదీనంగా చూసింది. దానికెందుకో ఇంత బెనుత: ఆ రోజు ఈ రాములు గాడు రూపాయి కాగితం చూపించి రమ్మన్నా రాను పొమ్మన్నది. దానికీ నీతి నిజాయితీలు ఎలా వచ్చాయి. మొదటిసారిగా ఆడది తన జీవితంలో ఏ మగాడికయితే వశమవుతుందో ఇకీ జీవితానికి వాడే తనవాడు అనే నీతి దీనికెవరు నేర్పినట్లు? సిల్కు చీరల్లో అతి షోకుల్లో డాబు దర్పాలతో వుండే గొప్పింటి అమ్మగారికీ నీతి తెలియదా? పైకి తళతళ మెరిసే అందమైన మనిషి మనస్సు నిండా బురదా, కుళ్ళు. పైకి మురికిగా వికారంగా వుండే ఈ మూగదాని మనస్సు అలికి ముత్యాల ముగ్గులు పెట్టిన బుజ్జి బొమ్మరిల్లు.

.... సత్యం అలా ఆ స్టీరింగుముందు ఎంతో సేపు కూర్చున్నాడు. ఎన్నో ఆలోచనలు చేశాడు. ఎంతో మథనపడ్డాడు.

ఇంతలో -

బీడీ వెలిగించడానికి గీసిన అగ్గిపుల్లను ఎత్తిపట్టుకుని, ఎవర్రా అది, బండిలో కూర్చుంది అన్నాడు ' దొడ్డి దార్నుంచి వచ్చిన మెకానిక్ రాములు.

సత్యం తలెత్తి, "నేనే గూరూ!" అన్నాడు నీరసంగా.

"నీవటో సత్యం! బండి వచ్చిందా! డ్యూటీ ఎప్పుడు దిగావు?"

"ఇందాకే సాయంత్రం".

రాములు మాంచి వుషారుగా వున్నాడు. ఏవేవో మాటాడాడు. ఆఖరికి నవ్వుతూ, "అరేయ్ సత్యం చెప్పడం మర్చిపోయారా! నీ మూగది ఈ వారం రోజుల్నుంచి నీకోసం తిరగలేక ఛస్తుందిరా!" అన్నాడు.

సత్యం మాటాడలేదు.

"గంట ఎనిమిది దాటిందనుకుంటా. సరేగాని పలావు తినిపిస్తా వస్తావురా!" అన్నాడు రాములు వుషారుగా, రాముల్ని చూస్తుంటే తనకు పట్టరాని కోపం వస్తుంది.

"రాను గురూ! యింటికి పోయి పడుకుంటా"

"అయితే, నేను తిని వస్తా గాని, నీవు బండి తీసికెళ్ళి షెడ్డులో పెట్టరా! హోటల్ ముందు ఆపితే పోలీసులు కేసు పెట్టుతున్నారు" అన్నాడు.

సత్యం "సరే" అని లారీ స్టార్టు చేశాడు.

మెయిన్ రోడ్డులో రాములు దిగిపోయాడు. సత్యం లారీని షెడ్డు వయిపు త్రిప్పాడు.

ఎంత వద్దనుకున్నా సత్యం మనస్సులోంచి ఆలోచనలను తుడిచేసుకోలేకపోతున్నాడు. మాటిమాటికి తనని మోసం చేసిన వోనర్ పెళ్ళాం, తనకోసం తపించిపోయే మూగదాని జాలిమొగం - మనసులో మెదులుతున్నారు. వోనర్ పెళ్ళాం మనస్సులోకి వచ్చినపుడు కసి, పగ, ద్వేషం వంట్లో రక్తాన్ని కుతకుత లాడిస్తున్నాయి. మూగది మనస్సులోకి వచ్చినప్పుడు విపరీతమైన జాలి, సానుభూతి, తనమీద తనకు కోపం వస్తున్నాయి.

ఇంతలో లారీ షెడ్డు వచ్చింది. ఆ సందులో లారీని అటు త్రిప్పి, ఇటు త్రిప్పి షెడ్డు లోపలికి పెట్టడానికి రివర్స్ చేశాడు.

లారీ వెనకభాగం మెల్లమెల్లగా షెడ్డులోకి వచ్చి ఆగటం, ఒక పెద్ద శబ్దం, లారీకి పెద్ద కుదుపు ఒక భయంకర ఆర్తనాదం వినిపించటం. ఒక్క తృటికాలంలో అన్నీ వరుసగా జరిగిపోయాయి. ఏదో గేదెపడ్డ లారీకింద పడ్డట్లు "బే-బే" అని అరుపు వినిపించింది.

ప్రక్క షెడ్డుల్లో పనిచేసేవాళ్ళు, చేస్తున్న పనులు ఆపి, "ఏంటో అది!" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చారు.

సత్యానికేంజరిగిందో అర్థంకాలేదు. అంతా అయోమయంగా వుంది. ఇంజను ఆపి కిందకు దిగాడు.

"అరెరె మనిషిరా - మనిషిమీదకెక్కించాడురా"

"అరేయ్ కోటి ఆ గ్యాసులైటు తేరా!"

"మూల్గుతున్నాడురా!"

గ్యాసు లైటు వచ్చింది.

"ఒరేయ్ మూగదిరోయ్!"

"ఆర్నీ! మూగదానిమీద సత్యం లారీ ఎక్కించాడురా."

"ఇంకా పేణం వున్నట్టుందిరా!"

"ఇవతలికి లాగండిరా!"

"ఆఁ ఆ - అట్టాఁ. కాలట్టుకు ఇవతలికి లాగు, అబ్బ, వళ్లంతా తుక్కు తుక్కు అయిందిరా."

"ఇదసలు ఈయాల్టప్పుడిక్కడికి ఎందుకు వచ్చిందిరా?"

"సత్తెం కోసం వచ్చింది గురూ! ఆడు సాయంత్రం వూర్నుంచి వచ్చాడని ఎవరో చెప్పారు. వాడ్ని ఈపూట కళ్ళతో చూడనిదే గుడిశకు పోనని యిక్కడే కూర్చుందిరా!"

"కూర్చుని నిద్రపోయి వుంటుందిరా! ఈలోపల మనోడు బండి ఎక్కించాడు. చెవిటి ముండగా. లారీ మోత వినిపించి వుండదు."

"ఆసినీ మూగముండ. పేనం మీదకు తెచ్చుకున్నావుగందే!"

మూగదాన్ని ఇవతలికి లాగారు. రక్తం పెద్ద మడుగు కట్టింది. టైరు రెండు కాళ్ళ మీదుగా పొట్ట మీదగా ఎక్కి గుండెమీద ఆగిపోయింది. పొట్టంతా పగిలిపోయి ప్రేగులు బయటికి వచ్చాయి.

చేతులు అటుఇటు మెల్లగా కదిలిస్తూ సన్నగా మూలుగుతుంది. కొనవూపిరితో వుంది.

"చూడ్రా సత్తిగా, ఎంతపన్జేశావో!" అని ఎవరో సత్యాన్ని ముందుకు లాగారు.

సత్యం ముందుకు వచ్చాడు. మూతపడిపోతున్న మూగదాని కళ్ళకు సత్యం కనిపించాడు. ఒక్క క్షణం సత్యం వయిపు చూపు నిలిపింది. సత్యం ముంగాళ్ళ మీద కూర్చుని దాని చేయి పట్టుకున్నాడు.

సత్యం మీదే నిలిచిన చూపు జారిపోతున్న ప్రాణాలతోపాటు వెనక్కి వెనక్కి తగ్గి, తెల్ల గుడ్డులోకి జారిపోయి మూతపడ్డ కనురెప్పలు క్రింద శాశ్వతంగా బిగుసుకుపోయింది.

సత్యం చేతిలోని మూగదాని చేయికూడా కట్టెలాగా బిగుసుకు పోయింది,

సత్యం కళ్ళనుండి రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

*18 జులై 1969*

★